ముఠాగా మారి...!



చిత్తూరు జిల్లా కేంద్రంలో గత వారం ఓ దొంగల ముఠా హల్ చేయడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ఆ ముఠాలో కీలక నేరస్థుడితో పాటు మరో ముగ్గురు నిందితులు నంద్యాల జిల్లాకు, మరో ముగ్గురు నిందితులు అనంతపురం జిల్లాకు చెందిన వారు ఉన్నారు. దీంతో ఈ ముఠా వ్యవహారం ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలో హాట్ టాఫిక్‌గా మారింది. సదరు ముఠాలోని కీలక నేరస్థుడు పసుపులేటి సుబ్రహ్మణ్యం అలియాస్ మాల్యాలుపై నంద్యాలలో గతంలో ఆరు కేసులు నమోదై ఉండటం నంద్యాల జిల్లా వ్యాప్తంగా కలకలం రేపింది. నంద్యాల జిల్లా కేంద్రంలోని సాయిబాబానగర్‌కు చెందిన పసుపులేటి సుబ్రమణ్యం ఆటో డ్రైవర్‌గా ఉంటూ ఆ తర్వాత ఇదే కాలనీలో.. కట్టెల డిపో పెట్టాడు. అయితే ఇదే క్రమంలో జిల్లాలోని బేతంచెర్ల మండలం ముద్దవం గ్రామానికి చెందిన రామకృష్ణ కూడా నంద్యాలకు వలస వచ్చి ఇదే కాలనీలో కట్టెల డిపో పెట్టాడు. కొన్ని నెలల తర్వాత సుబ్రహ్మణ్యం, రామకృష్ణల మధ్య వాగ్వాదం కాస్తా గొడవలకు దారి తీసింది. ఆ తర్వాత రామకృష్ణను 2005లో సుబ్రహ్మణ్యం పట్టపగలే హత్య చేయడం అప్పట్లో సంచలనమైంది. ఎమ్మిగనూరుకు చెందిన ఓ ముఠాతో కలిసి సుబ్రహ్మణ్యం ఈ హత్య చేసినట్లు నంద్యాల టూటౌన్ పోలీసులు కేసు కూడా నమోదు చేశారు.

నంద్యాల, మార్చి 18(ఆంధ్రజ్యోతి):

ఫర్నీచర్ షాపు పేరుతో రూ.కోట్లలో అప్పులు

పసుపులేటి సుబ్రహ్మణ్యం నంద్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా.. ఎస్ఎల్‌వీ పేరుతో అప్పట్లో ఫర్నీచర్ దుకాణం పెట్టాడు. కంతుల వారీగా వారిగా ఫర్నీచర్ వ్యాపారానికి తెరలేపాడు. ఈ క్రమంలో పెద్దఎత్తున ఖాతాదారులు నగదు చెల్లించారు. సదరు నగదుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి సొమ్ముచేసుకున్నారని సమాచారం. ఒక్కసారిగా ఐపీ పెట్టి 2019లో చిత్తూరుకు మకాం మర్చాడు. అక్కడ కూడా ఇదే తరహాలో ఇదే పేరుతో ఫర్నీచర్ దుకాణం పెట్టి పలు వ్యాపారాలు చేసి రూ.కోట్లలో అప్పులు పాలైనట్లు తెలిసింది. అక్కడ పరిచమైన ఆరుగురితో కలిసి దొంగతనాలకు పాల్పడేవాడు. ఇదే క్రమంలో ఈనెల 12వ తేదీన చిత్తూరు పట్టణంలో ఓ దుకాణంలో దొంగతనానికి యత్నించి ముఠా సభ్యులతో కలసి సుబ్రహ్మణ్యం పోలీసులకు దొరికిపోయాడు. అక్కడి స్థానికులు వీరిని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.



నిందితులు అందరూ తెలిసిన వారే

సదరు ముఠాలోని నిందితులందరూ కూడా కీలక నేరస్థుడు సుబ్రహ్మణ్యంకు తెలిసిన వారే. 2005లో హత్య చేయడంతో భాగస్వాములైన వారిలో ఒకరైన దొమ్మర కిష్టప్ప సదరు హత్య తరువాత నంద్యాల నుంచి అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం జారుట్ల రామాపురం గ్రామానికి వలస వెళ్లి ఇప్పటికి వరకు అక్కడే జీవిస్తున్నట్లు తెలిసింది. నంద్యాలలోని తన ఫర్నీచర్ దుకాణంలో పనిచేసిన నంద్యాల పట్టణానికి చెందిన చల్లగాలి నవీన్‌కుమార్(ఏ3), ఇబ్రహీం (ఏ2), సుబ్రహ్మణ్యం (ఏ1), కుంచం సంపత్ కుమార్ (ఏ7)లు మరో ముగ్గురు రామాంజనేయులు(ఏ4), దొమ్మర రాజశేఖర్(ఏ5) దొమ్మర నెట్టి కంటయ్య(ఏ6)లతో కలసి చిత్తూరులో దోపిడీకి వెళ్లి దొరికిపోయారు.

అతడిపై ఆరు కేసులు

చిత్తూరు దొంగల ముఠా ఘటనలో కీలక నేరస్థుడిగా నమోదైన పసుపులేటి సుబ్రహ్మణ్యం(ఏ1)పై నంద్యాల జిల్లా కేంద్రంలో గతంలో ఆరు కేసులు నమోదయ్యాయి. రెండు హత్య కేసులు. ఒకటి దొంగతనం.. రాబరీ కేసులు. మరో రెండు బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఆయా కేసుల పరంగా జైలు శిక్ష కూడా అనుభవించాడు. ఓ కీలక నాయకుడి అనుచరుడి హత్య, నంద్యాల తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని కానాల సమీపంలో కల్వర్టు వద్ద ఓ మహిళ హత్య ఘటనలో సుబ్రహ్మణ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వీటితో పాటు 2005లో టెలికాం డీఈఈ వెంకటేశ్వర్లు ఇంట్లో దొంగతనం కేసుతో పాటు.. ఇదే క్రమంలో టూటౌన్ పోలీసుస్టేషన్‌లో రాబరీ కేసు నమోదైంది. సదరు కీలక నేరస్థుడిపై రౌడీషీట్ నమోదు ఉండటంతో.. టూటౌన్ పోలీసు స్టేషన్‌లో బైండోవర్ కేసులు నమోదు చేశారు. అదేవిధంగా చిత్తూరు దోపిడీ కేసులోని ఏ7 నిందితుడు కుంచం సంపత్‌కుమార్‌పై నంద్యాల ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో 2011లో రోడ్డు ప్రమాదం కేసు ఒకటి నమోదైంది.

- దొంగతనాలు, దోపిడీలే టార్గెట్
- చిత్తూరులో ఇటీవల చోరీకి యత్నం
- అడ్డంగా దొరికిపోయిన నంద్యాల వాసులు
- వారిపై గతంలో పలు కేసులు నమోదు
- చర్చనీయాంశమైన 'చిత్తూరు' ఘటన





వైసీపీ భక్త ఎస్ఐపై వేటు

- ఆస్పరి ఎస్ఐ సీ. వెంకటనరసింహులు సస్పెండ్
- చిత్తూరు జిల్లాలో చేసిన అరాచకాలు వెలుగులోకి..
- అధికార అండదండలతో చిత్తూరు నుంచి కర్నూలుకు
- జిల్లా దాటి వెళ్లకూడదంటూ ఆదేశాలు

ఆదోని/చిత్తూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పలువురు పోలీసు అధికారులు కండువా వేసుకొని వైసీపీ నాయకుల్లా పనిచేసిన విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలో అయితే మరీ ఏక పక్షంగా పనిచేశారు. టీడీపీ శ్రేణులే లక్ష్యం చేసుకుని అక్రమ కేసులు, హత్యాయత్నం కేసుల్ని నమోదు చేసి ఇబ్బంది పెట్టిన ఆస్పరి ఎస్ఐ సి.వెంకట నరసింహులు మంగళవారం సస్పెండ్ అయ్యారు. చిత్తూరు జిల్లా సోమల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సమయంలో ఎస్ఐ సీవీ నరసింహులు ఓ కేసులో వసూళ్లకు పాల్పడినట్లు నిర్ధారణ అయింది. దీంతో ఆయనను సస్పెండ్ చేసి కర్నూలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో సరెండర్ కావాలని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ తాజాగా ఉత్తర్వులు విడుదల చేశారు. తమకు తెలియకుండా కర్నూలు హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళకూడదు అంటూ ఆదేశించారు. వైసీపీ హయాంలో పెద్దఎత్తున అరాచకాలు చేసిన అతను తెలివిగా ప్రభుత్వం మారిన వెంటనే చిత్తూరు జిల్లా నుంచి బదిలీ చేసుకుని కర్నూలు జిల్లా ఆస్పరి స్టేషన్‌కు వెళ్లారు. కానీ, అతను చిత్తూరు జిల్లా సోమలలో చేసిన అరాచకాలు వెలుగులోకి రావడం, రికార్డెడ్‌గా ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు వేటు వేశారు. సస్పెన్షన్ ఉత్తర్వుల్లో కూడా అతడిపై వచ్చిన ఆరోపణల్ని ప్రస్తావించారు. ఇదిలా ఉండగా సదరు అవినీతి ఎస్ఐపై ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితయ్యాయి. పోలీస్ ఉన్నతాధికారులు ఆంధ్రజ్యోతి కథనాలను కూడా పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.



సస్పెండయిన ఆస్పరి ఎస్ఐ వెంకట నరసింహులు

మిగతా 7వ పేజీలో

నేర నియంత్రణకు విజువల్ పోలీసింగ్

నంద్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర నియంత్రణకు విజువల్ పోలీసింగ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా మంగళవారం తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో విస్తృతంగా తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. సైబర్ క్రైం, రోడ్డు ప్రమాదాల నివారణ, డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలు, మహిళలపై జరిగే నేరాలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. జిల్లాలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతి సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు డ్రోన్ కెమెరాలను వినియోగిస్తామన్నారు.

కాలువలపై సోలార్ వెలుగులు

- 'కెనాల్ టాప్ సోలార్ ప్లాంట్'పై ప్రభుత్వం దృష్టి
- అవసరమైన స్థలాలు గుర్తించాలని ఆదేశాలు

6

వైభవంగా తెప్పోత్సవం

- ఉభయ దేవేరులతో విహరించిన శ్రీవారు
- దిగువలో ముగిసిన ప్రహ్లాదవరదుని ఉత్సవాలు



కోనేటిలో కనులవిందుగా సాగుతున్న స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 18(ఆంధ్రజ్యోతి) : నమో నారసింహా.. అహోబిలేశా అని భక్తులు పారవశ్యంతో శ్రీవారిని స్తుతిస్తుండగా శ్రీదేవి, భూదేవి సమేతుడిగా కొలువైన ప్రహ్లద వరదస్వామి కోనేరులో తెప్పపై విహరించారు. దిగువ అహోబిలంలో ఆదిదేవునికి మూడు రోజులుగా జరుగుతున్న తెప్పోత్సవ వేడుకలు మంగళవారంతో ముగిసాయి. తెప్పోత్సవంలో భాగంగా అహోబిలానికి చెందిన శ్రీ ప్రహ్లద వరద కైంకర్య సభ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ స్వామివారికి ఉదయం పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా తిరుమంజనం, అభిషేకం, అర్చన, మంగళ హారతి నిర్వహించారు. ఉభయదేవేరులతో పల్లకిలో కొలువైన ప్రహ్లదవరదునికి తెప్పోత్సవం నిర్వహించారు.



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్

పల్లె దారినపడుతోంది..!

నంద్యాల హస్పిటల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి: పల్లె సీమలే దేశానికి పట్టుగొమ్మలు అన్న నానుడిని ప్రభుత్వం నిజం చేస్తోంది. రోడ్లను అభివృద్ధి చేస్తూ గ్రామీణ ప్రాంతాలకు కళకళ తెస్తోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పల్లెల్లో రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి గాను నంద్యాల జిల్లాకు 1023 సీసీ రోడ్లు, 3 బీటీ రోడ్లకు రూ.85,85,30,000 మంజూరు చేసింది. నవంబరులో పనులు ప్రారంభించి జనవరికే పూర్తి చేసిన ఘనత నంద్యాల జిల్లాకే దక్కింది. మూడు నెలల్లో 980 సీసీ రోడ్లకు గాను రూ.70.60 కోట్ల పనులు పూర్తి చేశారు. బనగానపల్లె, కోవెలకుంట్ల, ఆత్మకూరు ప్రాంతాల్లో రూ.5.40 కోట్లతో బీటీ రోడ్ల పనులు జరుగుతున్నాయి. జిల్లాలో అత్యధికంగా ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాల్లో సీసీ రోడ్ల నిర్మాణం అత్యధికంగా జరిగాయి. మరో 103 సీసీ రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. ఈ పనులన్నీ జాతీయ ఉపాధి పథకంలో భాగంగా జిల్లాకు మంజూరయ్యాయి. రూ.70.60 కోట్ల పనులకు గాను ప్రభుత్వం నుంచి రూ.8 కోట్లు మంజూరు చేయడంతో కాంట్రాక్టర్లు నిరాశలో ఉన్నారు. గ్రామ స్థాయిలో నాయకులు కూటమి ప్రభుత్వంలో పనులు చేసి బిల్లులు మంజూరుగాక ఆర్థిక పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలో ఎంతో ఉత్సాహంగా పనులు చేసినప్పటికీ కాంట్రాక్టర్‌లలో నిరుత్సాహం అలముకుంది.



దొర్నిపాడు మండలంలో పూర్తయిన సీసీ రోడ్డు



మసీదుపురంలో రూ. 5లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

రాష్ట్రంలో ఒకటో స్థానంలో జిల్లా పంచాయతీరాజ్‌శాఖ

రాష్ట్ర వ్యాప్తంగా 122 డిపార్ట్‌మెంట్‌లు ఉండగా రోడ్ల నిర్మాణం పూర్తి విషయంలో నంద్యాల జిల్లా పంచాయతీరాజ్ శాఖ ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా రూ.123 కోట్ల పనులు చేపట్టేందుకు అర్హత ఉన్నప్పటికీ రూ.85.85 కోట్లు పనులు మంజూరు చేసింది. రాష్ట్రంలో అట్టడుగున స్థానంలో ఉన్న జిల్లా పంచాయతీరాజ్‌శాఖ కూటమి ప్రభుత్వంలో నెంబర్ వన్ స్థాయికి ఎదగడం విశేషం.

మార్చిలోపు మిగిలిన పనులు పూర్తి చేస్తాం

జిల్లా వ్యాప్తంగా 103 సీసీ రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి, వీటన్నింటినీ మార్చిలోపు పూర్తి చేస్తాం. పనులు నాణ్యతతో పాటు పారదర్శకంగా చేపట్టడంలో సిబ్బంది కృషిచేశారు. కలెక్టర్ రాజకుమారితో పాటు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ నుంచి ప్రశంసలు అందుకున్నాం. - నాగరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, నంద్యాల

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	వివరం	సంఖ్య
1. నంద్యాల	మంజూరైన సీసీ రోడ్లు	103
	పూర్తయిన సీసీ రోడ్లు	87
	నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లు	16
2. ఆళ్లగడ్డ	మంజూరైన సీసీ రోడ్లు	240
	పూర్తయిన సీసీ రోడ్లు	221
	నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లు	19
3. పాణ్యం	మంజూరైన సీసీ రోడ్లు	71
	పూర్తయిన సీసీ రోడ్లు	56
	నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లు	15
4. ఆత్మకూరు	మంజూరైన సీసీ రోడ్లు	164
	పూర్తయిన సీసీ రోడ్లు	146
	నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లు	18
5. బనగానపల్లె	మంజూరైన సీసీ రోడ్లు	145
	పూర్తయిన సీసీ రోడ్లు	132
	నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లు	13
6. డోన్	మంజూరైన సీసీ రోడ్లు	64
	పూర్తయిన సీసీ రోడ్లు	60
	నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లు	4
7. నందికొట్కూరు	మంజూరైన సీసీ రోడ్లు	236
	పూర్తయిన సీసీ రోడ్లు	218
	నిర్మాణ దశలో ఉన్న సీసీ రోడ్లు	18

- గ్రామీణ ప్రాంతాలకు రోడ్ల కళకళ
- రాష్ట్ర ప్రభుత్వంలో రహదారుల అభివృద్ధి
- జిల్లాలో 1023 సీసీ, మూడు బీటీ రోడ్లు మంజూరు
- మూడు నెలల్లోనే 925 సీసీ రోడ్లు పూర్తి
- రూ.81.85 కోట్లతో పనులు పరుగులు

ఇద్దరు ఈఈల సస్పెండ్

- ఆరు నెలలైనా విధుల్లో చేరకపోవడంపై చర్యలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం..

కర్నూలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరులో బదిలీ చేస్తే.. ఆరు నెలలు కావస్తున్నా విధుల్లో చేరని ఇద్దరు ఇంజనీర్లపై ప్రభుత్వం కొరడా విసిరింది. మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కాంపిటెంట్ అథారిటీ అధికారి ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్ విడిచి వెళ్లరాదని ఆదేశించారు. ఈ మేరకు జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సెప్టెంబరు 22న ఇరిగేషన్ శాఖ కర్నూలు ప్రాజెక్ట్ ఆఫీస్ డిప్యూటీ సీఈగా పని చేస్తున్న ఎస్. లక్ష్మానాయక్‌ను శ్రీశైలం డ్యాం మెయింటెనెన్స్ సర్కిల్ డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు. అలాగే.. విజయవాడ ఇరిగేషన్ సర్కిల్ (ఐసీ) పరిధిలో తెనాలి కేడబ్ల్యూ డివిజన్ ఈఈగా పని చేస్తున్న ఎస్. మల్లికార్జునను శ్రీశైలం డ్యాం మెయింటెనెన్స్ సర్కిల్ సీఅండ్ బీ డివిజన్ ఈఈగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆరు నెలలు కావస్తున్నా విధుల్లో చేరలేదు. ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించి విధుల్లో చేరకపోవడంతో ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (సీసీ అండ్ ఏ) రూల్స్, 1999లోని రూల్ 8లోని సబ్ రూల్ (1) ప్రకారం వీరిని సస్పెండ్ చేశారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు వీరు సస్పెన్షన్‌లో కొనసాగుతారని జలవనరుల శాఖ స్పెషన్ సీఎస్ సాయిప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు.

కలిసి వచ్చిన పసుపు

పొలంలో కుప్పగా పోసిన పసుపు కొమ్ములు



పచ్చ బంగారం.. పసుపు పంట ఈ ఏడాది రైతుకు కలిసి వచ్చింది. వట్టి పసుపు ధర ఒకింత పర్వాలేదనిపించేలా ఉంది. దీంతో పంట తవ్వకాలు ఊపందుకున్నాయి. చాగలమర్రి మండలంతో పాటు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో రైతులు పసుపును సాగు చేశారు. నియోజకవర్గ పరిధిలో చాగలమర్రి మండలంలో అధికంగా 300 ఎకరాల్లో పసుపు పంట సాగైంది. ఒక్క చిన్నవంగలి గ్రామంలోనే 200 ఎకరాల దాక పసుపు సాగు చేశారు. వ్యవసాయాధికారుల లెక్కల మేరకు ఆళ్లగడ్డలో 23 హెక్టార్లు, రుద్రవరంలో 75 హెక్టార్లు, శిరివెళ్లలో 15 హెక్టార్లు పసుపు సాగు చేశారు. ఒక ఎకరాలో ఈ పంట సాగుకు రూ.1.30 లక్షల దాక పెట్టుబడి కింద వెచ్చించారు.

- జోరుగా పసుపు తవ్వకాలు
- ఆశాజనకంగా దిగుబడి
- పర్వాలేదనిపిస్తున్న ధరలు

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పసుపు పంటను ఈ ఏడాది తెగుళ్లు అధికంగా సోకాయి. మొదట పైరు బాగా కనిపించిన పెరిగే కొద్ది దుంపకుళ్లు సోకింది. చాలా మంది రైతుల పొలాల్లో తెగుళ్ల ప్రభావంతో దిగుబడి తగ్గింది. పసుపు కొమ్ముకు చుట్టిన రెమ్మలు పుచ్చుపట్టి దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి తగ్గింది.



చిన్నవంగలిలో పసుపు కొమ్ములను కోస్తున్న కూలీలు

ఆశాజనకంగా ధరలు

మార్కెట్‌లో వట్టి పసుపు క్వింటం రూ.9,500 పలుకుతుంది. గత ఏడాది వట్టి పసుపు క్వింటం రూ.15 వేలు పైబడి ధర పలికింది. ప్రస్తుతం రూ.9,500 నుంచి రూ.10 వేల వరకు ఉంది. అయితే ఈ ఏడాది కూడా కొత్త పసుపు ధర పెరుగుతుందని ఆశాభావం రైతుల్లో వ్యక్తమవుతోంది. ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రావడంతో పాటు మార్కెట్‌లో కూడా క్వింటం రూ.10 వేలు ధర పలుకుతుండటంతో రైతన్నలో ఆనందం వ్యక్తమవుతోంది. ఎకరాకు రూ.30 వేలు నుంచి రూ.40 వేలు మిగులుతుందని రైతులు అంటున్నారు. దిగుబడితో పాటు క్వింటం రూ.15 వేలు నుంచి రూ.20 వేలు వరకు అమ్మితే మంచి లాభాలు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా పసుపు పంట రైతులకు ఊరట కలిగించింది.

ఈ ఏడాది పసుపు కలిసి వచ్చింది



ఏడున్నర ఎకరాల్లో పసుపు పంట సాగు చేశా. అయితే ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వస్తుండటంతో అన్ని ఖర్చులు పోను రూ.20 వేలు నుంచి రూ.30 వేలు మిగులుతోంది. ఈ ఏడాది కొంచెం మేలుగా ఉందని, గత ఐదేళ్ల నుంచి పసుపు సాగులో తీవ్రంగా నష్టపోయాం. ధర పెరిగితే మంచి లాభాలు వస్తాయి.

- గురునాథ్‌రెడ్డి, రైతు, చిన్నవంగలి

కష్టానికి తగ్గ ఫలితం



పసుపు సాగులో కష్టానికి తగ్గ ఫలితం ఉంది. 1.50 ఎకరాల్లో పసుపు పంట సాగు చేశా. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టా. దిగుబడి 25 నుంచి 30 క్వింటాళ్ల దాకా వచ్చింది. ఉన్న ధరతో పసుపు విక్రయిస్తే కొంత ఊరట ఉంది. ధర పెరిగితే మరింత లాభాలు వస్తాయి. ఈ ఏడాది పసుపు పంట ఆశాజనకం.

-రమణయ్య, రైతు, చిన్నవంగలి

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలి



పసుపు దిగుబడిని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేస్తే రైతులకు మరింత మేలు జరుగుతుంది. 2 ఎకరాల్లో పసుపు పంట సాగు చేశా. ఎకరాకు రూ.130 లక్షలు ఖర్చు చేశా. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. క్వింటా రూ.9,500 పలుకుతుండటంతో ఈ ధరకు అమ్మితే కొంత మేర లాభం వస్తుంది. రూ.15 వేలు ధర పలికితే రైతుకు మంచి లాభాలు వస్తాయి.

- నరసింహారెడ్డి, రైతు, చిన్నవంగలి

గజ వాహనంపై లక్ష్మీమాధవుడు

పుష్ప పల్లకిలో స్వామి, అమ్మవార్లు



గజవాహనసేవలో పాల్గొన్న భక్తులు

కోడుమూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్లలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం మాధవుడు లక్ష్మీ సమేతుడై గజవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా పురోహితులు ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తులను రాజగోపురం గుండా ఆలయం వెలుపలికి తోడ్కొని వచ్చి గజవాహనంపై ఆశీనులను గావించారు. దీంతో గోరంట్ల గ్రామవాసులు వాహనానికి ముందు, ఎర్రగుడి ప్రజలు వెనుక భాగంలో ఉంటూ వాహనసేవకులయ్యారు. గజవాహనసేవను తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రాత్రి 11 గంటల సమ యంలో లక్ష్మీమాధవుడు పుష్పపల్లకిలో విహరించారు.

అవాంతరాలు: లక్ష్మీ మాధవులకు మంగళవారం నిర్వహించిన గజవాహనసేవ అవాంతరాల నడుమ ముగిసింది. మధ్యాహ్నం ఆలస్యంగా ప్రారంభమైన వాహనసేవలో ఎర్రగుడి వాసులు వెనుక భాగంలో ఉన్నారు. గోరంట్ల గ్రామప్రజలు ముందుభాగంలో నిలబడ్డారు. అయితే వాహనసేవ జరుగుతున్న క్రమంలో కాడి విడిపోవడం, తాళ్లు తెగడం వంటి అవాంతరాలు ఏర్పడ్డాయి. ఒక దశలో గజవాహనానికి వెనుక భాగంలో బలప్రయోగం అధికం కావడంతో వేగంగా వెనక్కి వెళ్లింది. ఈ సమయంలో ఓ కానిస్టేబుల్‌కు కాడిమాను తగిలింది. దీంతో ఆయన అస్వస్థతకు గురికాగా ఆసుపత్రికి తరలించారు. సోమవారం జరిగిన గరుడవాహనసేవలో ఎర్రగుడికి చెందిన ఓ వ్యక్తి కాలికి గాయమైన సంగతి తెలిసిందే.

ప్రారంభమైన ఇంటర్ పేపర్ మూల్యాంకనం

ఏప్రిల్ రెండోవారంలో ఫలితాలు వచ్చే అవకాశం

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ పేపర్ మూల్యాంకనం చురుగ్గా సాగుతోంది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు పూర్తికావడంతో వెంటనే పేపర్ మూల్యాంకనం ప్రారంభించారు. డీఐఈవై సునీత పర్యవేక్షణలో 300 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్‌లు, 50 మంది చీఫ్ ఎగ్జామినర్‌లు, 50 మంది స్క్రూటినైజర్‌లు, 8 మంది అసిస్టెంట్ క్యాంప్ ఆఫీసర్‌లతో మూల్యాంకనం జరుగుతోంది. సోమవారం నుంచి మ్యాథ్స్, ఇంగ్లీష్, సివిక్స్, హిస్టరీ, తెలుగు పేపర్‌ల మూల్యాంకనం జరుగుతోందని, ఈనెల 22వ తేదీ నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్, 24వ తేదీ నుంచి కెమిస్ట్రీ, 26వ తేదీ నుంచి బాటనీ, జువాలజీల వాల్యూవేషన్ జరుగుతుందని డీఐఈవో తెలిపారు. ప్రతిరోజు ఒక్కో అధ్యాపకుడు 30 జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారని వివరించారు. ఏప్రిల్ 4వ తేదీలోపు మూల్యాంకనం పూర్తిచేసి అదే నెల రెండోవారం కానీ మూడో వారం కాని ఫలితాలను వెల్లడించేందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది.



ఇంటర్ పేపర్ వాల్యూయేషన్ జరుగుతున్న నంద్యాల ప్రభుత్వ బాలికల కళాశాల

అభివృద్ధి బాటలో నడవాలి

జాతీయస్థాయి ఐటీ మీట్‌లో ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు



వీసీని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ గురించి తెలుసుకోవాలని రాయలసీమ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట బసవరావు పేర్కొన్నారు. నంద్యాల శ్రీరామకృష్ణా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్స్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఐటీ మీట్‌కు వారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వైస్ ఛాన్సలర్‌తో పాటు కళాశాల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, కార్యదర్శి విజయకుమారి, ప్రిన్సిపాల్ కెబీవి సుబ్బయ్య, డెరెక్టర్ హేమంత్‌రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్స్ ఏఎస్ ప్రగతిరెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ జి. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైస్ ఛాన్సలర్ నాయకత్వంలో యూనివర్శిటీ, కళాశాలలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం కోడ్ క్వెస్ట్, టెక్నికల్ క్విజ్, పేపర్ ప్రజంటేషన్, మైండ్ మారథాన్ వంటి కల్చరల్ యాక్టివిటీస్ గురించి వివరించి పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

ఈవీఎం గోదాములను పరిశీలించిన కలెక్టర్



ఈవీఎం గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా నంద్యాల టెక్కె మార్కెట్ యార్డులో ఈవీఎంలు భద్రపరిచిన గోదాములను కలెక్టర్ పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాముకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాముల వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, ఎన్నికల విభాగం తహసీల్దార్ జయప్రసాద్‌లతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

22న గరికపాటి నరసింహారావు కర్నూలుకు రాక

కర్నూలు కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని విజ్ఞాన సేవా సమితి (వీఎస్ఎస్) ఆధ్వర్యంలో, ఈనెల 22న సాయంత్రం 5 గంటలకు బి.క్యాంపులోని టీజీ లక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న 'ఉగాది మహోత్సవం' కార్యక్రమానికి పద్మశ్రీ పురస్కార గ్రహీత, ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు విచ్చేస్తున్నట్లు వీఎస్ఎస్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డాక్టర్ ఎండీవీఎన్ రామశర్మ వ్యవహరిస్తారని, ప్రధాన ఉపన్యాసకులుగా డాక్టర్ గరికపాటి నరసింహారావు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్లస్టర్ యూనివర్శిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్, శ్రీశైలంలోని అఖిల భారత కరివేన నిత్యాన్నదాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ ఎన్.వేణుగోపాల్ హాజరవుతారని, ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా తెలుగు ఉపాధ్యాయురాలు డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని వ్యవహరిస్తారని నిర్వాహకులు తెలిపారు.

కాలువలపై సోలార్ వెలుగులు



ఎస్ఈ, ఈఈలతో సమీక్షిస్తున్న కర్నూలు ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా

- 'కెనాల్ టాప్ సోలార్ ప్లాంట్'పై ప్రభుత్వం దృష్టి
- అవసరమైన స్థలాలు గుర్తించాలని ఆదేశాలు
- ఎస్ఈ, ఈఈలతో సమీక్షించిన ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా
- రేపు స్పెషన్ సీఎస్ ప్రత్యేక సమావేశం

కర్నూలు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సౌరశక్తితో వెలుగులు నింపాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కాలువలు, ప్రభుత్వ స్థలాల్లో సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు కసరత్తు చేస్తుంది. దీనిపై ఈ నెల 20న రాష్ట్ర ప్రభుత్వం, జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ సీఈలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. సమగ్ర వివరాలతో హాజరు కావాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే మంగళవారం ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ కర్నూలు సీఈ కబీర్‌బాషా కర్నూలు సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్‌రెడ్డి, ఎస్ఆర్‌బీసీ-1, తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ శివప్రసాద్‌రెడ్డి, శ్రీశైలం ప్రాజెక్టు ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి, ఎస్ఆర్‌బీసీ-2 సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్‌రెడ్డి సహా ఆయా సర్కిల్స్ ఈఈలతో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో తుంగభద్ర ప్రాజెక్టు ఎల్లెల్సీ, కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, తెలుగుగంగ కాలువ, హంద్రీనీవా కాలువ, గాజులదిన్నె ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలు సహా వివిధ నీటి వనరులు, జలవనరుల శాఖ పరిధిలోని ఖాళీ స్థలాల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఏపీ కాలువలపై సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు అనుకూలంగా ఉంది. కాలువ పక్కనే ఉన్న ఖాళీ స్థలాలు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఖాళీగా ఉన్న జలవనరుల శాఖకు చెందిన స్థలాలు, వాటి విస్తీర్ణం, కబ్జాకు గురైన స్థలాలు.. పూర్తి వివరాలు వివరాలతో నివేదిక ఇవ్వాలని సీఈ కబీర్‌బాషా ఎస్ఈలను ఆదేశించారు. బుధవారం సాయంత్రంలో నివేకలు ఇస్తే.. వాటి ఆధారంగా ఉమ్మడి జిల్లా నివేదిక తయారు చేసి గురువారం (20న) జరిగే స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ సమీక్షా సమావేశానికి హాజరయ్యేందుకు సీఈ సన్నాహాలు చేసుకుంటున్నారు. సాగునీటి కాలువలపై కెనాల్ టాప్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేస్తే.. వందలాది మెగావాట్స్ సౌరవిద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

కలెక్టర్‌ను కలసిన సీఈ కబీర్‌బాషా

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ కర్నూలు సీఈ కబీర్‌బాషా మంగళవారం రాత్రి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిశారు. ఇటీవల కబీర్‌బాషా ఎస్ఈ నుంచి సీఈగా పదోన్నతి పొందారు. కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశానని కబీర్‌బాషా ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, కొత్తగా చేపట్టాల్సిన ప్రాజెక్టులు, సాగునీటి వనరుల నిర్వహణ, వేసవిలో అందుబాటులో ఉన్న నీటి నిల్వలపై ప్రధానంగా చర్చకు వచ్చినట్లు తెలిసింది.



దాహం తీర్చాలని హైవే రోడ్డుపై ఖాళీ బిందెలతో గ్రామస్థుల బైఠాయింపు

నీటి కోసం...!

మంత్రాలయంలో హైవేపై గ్రామస్థుల ధర్నా

మంత్రాలయం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 'తాగేందుకు గుక్కెడు నీరివ్వండి మహాప్రభో..' అంటూ ప్రజలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టిన ఘటన మంత్రాలయంలో మంగళవారం చోటు చేసుకుంది. ఉదయం కల్లుదేవకుంట గ్రామస్థులు దాదాపు వందమందికి పైగా ఒక్కసారిగా ఖాళీబిందెలతో ఎమ్మిగనూరు - మంత్రాలయం హైవేపైకి వచ్చారు. తాగునీరు లేక ఇబ్బందులు పడుతుంటే ఎవరూ పట్టించుకోవడం లేదంటూ ప్రజలు ఆందోళన చేపట్టారు. దాదాపు గంట సేపు ధర్నా చేయడంతో రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేవరకూ ధర్నాను విరమించే ప్రసక్తే లేదని గ్రామస్థులు భీష్మించారు. మంత్రాలయం సీఐ రామాంజులు, తహసీల్దార్ రవి, ఎస్ఐ శివాంజల్ ఎంత చెప్పినా వారు వినలేదు. చివరకు ఆదోని నుంచి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఏఈ వెంకట్రాముడు, ఎస్‌ఏపీ స్కీం కాంట్రాక్టరు, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అక్కడకు చేరుకు నిరసనకారులతో మాట్లాడారు. నెల రోజులో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు. రూ.20 లక్షలతో పైప్‌లైన్లు వేయించి కల్లుదేవకుంట, చిలకలడోన, చెట్నహళ్లి గ్రామాలకు తాగునీటిని అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ తెలిపారు.



ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదని సూచనలు ఇస్తున్న పోలీసులు

ఏఎన్ఎం గ్రేడ్-3లకు పదోన్నతుల కౌన్సెలింగ్

173 మందికి హెల్త్ అసిస్టెంట్లుగా పదోన్నతి



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పని చేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. కర్నూలు, నంద్యాల జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న ఏఎన్ఎం గ్రేడ్-3లకు మంగళవారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. 175 మంది ఏఎన్ఎంలకు గాను 172 మంది హెల్త్ అసిస్టెంట్లు (ఫిమేల్) పదోన్నతులు కల్పించారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ, కర్నూలు నగర మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఏవో కే.అరుణ, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. అనంతరం డీఎంహెచ్‌వో పదోన్నతుల ఆర్డర్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పదోన్నతులు పొందిన ఏఎన్ఎంలు 15 రోజుల్లో జాయినింగ్ రిపోర్టు అందజేయాలని, ఎక్కడైతే సచివాలయంలో పని చేస్తున్నారో అక్కడే పని చేయాలన్నారు. కౌన్సెలింగ్‌లో సీనియర్ అసిస్టెంట్లు మధుసూదన్, గిరి, అజయ్‌బాబు, మురళి బ్రహ్మం, లోకసాయి సిబ్బంది పాల్గొన్నారు.

హాస్పిటల్ నుంచి కౌన్సెలింగ్‌కు...



భర్త సహాయంతో బయటకు వస్తున్న ఏఎన్ఎం నాగమణి

కర్నూలు హాస్పిటల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి):15 ఏళ్ల సర్వీసు తర్వాత వస్తున్న పదోన్నతి కోసం జరిగే కౌన్సెలింగ్‌కు తీవ్ర అనారోగ్యాన్ని సైతం లెక్క చేయలేదు ఆ మహిళా ఉద్యోగి. మంగళవారం ఏఎన్ఎం గ్రేడ్-3లకు ఎంపీహెచ్ఏ (ఎఫ్)లుగా పదోన్నతి కౌన్సిలింగ్ కర్నూలు మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో జరిగింది. కోడుమూరు సచివాలయం-3 లో పని చేస్తున్న ఏఎన్ఎం గ్రేడ్-3 నాగమణి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేటు హాస్పిటల్ ఐసీయూలో చేరింది. కౌన్సెలింగ్‌కు మినహాయింపు ఇవ్వాలని ఏఎన్ఎం భర్త డీఎంహెచ్‌వోను కోరారు. వీడియో కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కానీ 15 ఏళ్ల తర్వాత జరిగే పదోన్నతిలో నష్టపోవాల్సి వస్తుందని ఏఎన్ఎం అతికష్టం మీద హాస్పిటల్ నుంచి భర్త సాయంతో కౌన్సెలింగ్‌కు హాజరైంది. ఆమెకు ఏఎన్ఎంకు దేవనకొండ పీహెచ్‌సీ నేలతలమర్రి సబ్ సెంటర్‌కు పదోన్నతి పోస్టింగ్ ఇస్తూ డీఎంహెచ్‌వో ఆర్డర్స్‌ను అందజేశారు.

శనగ కొనుగోలు ప్రారంభం

- 15,848 మెట్రిక్ టన్నులకు అనుమతి

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటం రూ.5,650 మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలు జిల్లాకు 6,848 మెట్రిక్ టన్నులు, నంద్యాల జిల్లాకు 9,400 మెట్రిక్ టన్నుల శనగలను రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు డీసీఎంఎస్‌లు, సొసైటీల ద్వారా వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించింది. మంగళవారం ఆలూరు మండలంలోని హత్తిబెళగల్ డీసీఎంఎస్ కేంద్రంలో రైతుల నుంచి శనగలను కొనుగోలు చేసే కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ నవ్యతో పాటు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు స్థానిక వ్యవసాయాధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మార్క్‌ఫెడ్ డీఎం రాజు మాట్లాడుతూ శనగ రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

వైసీపీ భక్త ఎస్ఐపై వేటు

- ఆస్పరి ఎస్ఐ వెంకట నరసింహులు సస్పెండ్
- చిత్తూరు జిల్లాలో చేసిన అరాచకాలు వెలుగులోకి..
- అధికార అండదండలతో చిత్తూరు నుంచి కర్నూలుకు
- జిల్లా దాటి వెళ్లకూడదంటూ ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)



సస్పెన్షన్ ఉత్తర్వుల్లో వివరాలు...

- సెప్టెంబరు 2023లో భార్యాభర్తలు గొడవపడి చిత్తూరు జిల్లా సోమల స్టేషన్‌కు వచ్చారు. అప్పటి ఎస్ఐ నరసింహులు సదరు మహిళ నుంచి రూ.లక్ష డిమాండ్ చేశారు. ఆ మహిళ డబ్బులు లేవని చెప్పడంతో కానిస్టేబుల్ ద్వారా పాన్ బ్రోకర్‌ని స్టేషన్‌కు పిలిచారు. ఆమె తాళిబొట్టును తాకట్టు పెట్టి రూ.60వేలు తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో ఉంది. దాన్ని వడ్డీతో సహా చెల్లించి బంగారు తాళిబొట్టును తీసుకున్నట్లు విచారణలో తేలింది.
- అదే ఏడాది అదే స్టేషన్‌లో తన పొలంలోని రూ. మూడు లక్షల విలువ చేసే టమోటా పంట కోసం ఉంచిన వెదురు కర్రలు దొంగిలించారని ఓ వ్యక్తిపై బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. వ్యక్తిపై కేసు నమోదు చేసి కేసు కోసం రాజీ చేస్తానని ఇరు వర్గాల నుంచి రూ. 30వేలు నగదు తీసుకున్నట్లు తేలింది.
- 2023లో సోమలలో 213 ఎఫ్ఐఆర్ నెంబరుతో నమోదైన కేసులో యువరాజానాయుడిని స్టేషనుకు పిలిచి అత్యంత దారుణంగా తిట్టడంతోపాటు తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించిన వీడియో వైరల్ అయింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వ హయాం కావడంతో ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- 2023 డిసెంబరులో సోమల మండలం కమ్మపల్లెలో సంఘమిత్ర తొలగింపు విషయంగా ఘర్షణలు జరిగాయి. పోలీసుల సమక్షంలోనే మహిళలను వైసీపీ వర్గీయులు కొట్టారు. మగాళ్ల దుస్తులు చించేసి మరీ దాడి చేశారు. స్థానికులు వీడియోలు తీస్తుంటే ఎస్ఐ లాక్కున్నారు. టీడీపీ మద్దతుదారులపై హత్యాయత్నం కేసులు పెట్టిన ఎస్ఐ, వైసీపీ వారిపై నామమాత్రంగా బెయిలబుల్ కేసులు పెట్టారు. టీడీపీ వాళ్ల ఫిర్యాదుల్ని పట్టించుకోలేదు.
- ఓ గ్రామంలో వైసీపీ నేత వద్ద రూ.లక్ష లంచం తీసుకుని వారం రోజుల్లో ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లే ఓ యువకుడి మీద అక్రమ కేసు పెట్టి పైశాచిక ఆనందం పొందినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి.
- చెన్నైలో స్థిరపడిన ఓ డాక్టర్‌కు అతని బంధువుల మధ్య ఏర్పడిన భూసమస్యను పరిష్కరిస్తానని రూ.లక్ష లంచం తీసుకుని పట్టించుకోలేదని తెలుస్తోంది.
- పెద్దిరెడ్డి వద్ద మెప్పు పొందేందుకు ఓ సందర్భంలో బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌పై తన స్టేషన్‌లోనే నోరు పారేసుకున్న విషయం తెలిసిందే.



ఎస్సై దాష్టీకాలపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనాలు

నాలుగు రోజులు బ్యాంకులు బంద్

కర్నూలు న్యూసిటీ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి వరుసగా నాలుగు రోజులు బ్యాంకులు మూతపడనున్నాయి. 22న 4వ శనివారం కావడం, 23న ఆదివారం కాగా...24, 25 తేదీలలో బ్యాంకు సమ్మె జరగనుంది. రెండు రోజుల సమ్మెలో గ్రామీణ బ్యాంకులు, కో ఆపరేటివ్ బ్యాంకులతో సహా పబ్లిక్ సెక్టారు బ్యాంకులన్నీ సమ్మెలో పాల్గొననున్నాయి. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు వివిధ డిమాండ్‌లను పరిష్కరించుకునేందుకు రెండు రోజుల పాటు బ్యాంకులు బంద్ పాటిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

పాలిసెట్ ప్రవేశాలకు దరఖాస్తులు

కర్నూలు(ఎడ్యుకేషన్), మార్చి 18 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్రంలోని అన్ని పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సులో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కర్నూలు ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ మైనారిటీస్, జిల్లా కోఆర్డినేటర్, ప్రిన్సిపాల్ ఏ. చక్రవర్తి మంగళవారం తెలిపారు. పదో తరగతి, తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు అన్నారు. ఓసీ, బీసీ కులాలకు చెందిన వారు దరఖాస్తు రుసుం రూ.400, ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన వారు దరఖాస్తు రుసుం రూ.100 చెల్లించాలన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15వతేదీ చివరి గడువు అన్నారు. ఏప్రిల్ 30వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందనాన్నరు. మరిన్ని వివరాల కోసం 7382264325, 9494834320 నెంబర్లను సంప్రదించాలన్నారు.

తెలుగు రాష్ట్రాల ద్రోహులు కేసీఆర్, జగన్

- చంద్రబాబునాయుడులాంటి నాయకుడు తెలంగాణాకు కూడా అవసరమేమో..!
- టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న బైరెడ్డి

నందికొట్కూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా చిన్నాభిన్నం చేసి రెండు తెలుగు రాష్ట్రాల ద్రోహులుగా గురుశిష్యులైన మాజీ ముఖ్యమంత్రులు కేసీఆర్, వైఎస్ జగన్ నిలిచారని టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు మంగళవారం నందికొట్కూరు నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. రెండు తెలుగు రాష్ట్రాల మాజీ ముఖ్యమంత్రులపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలు నాశనం కావడానికి మాజీ ముఖ్యమంత్రులు ఇద్దరే కారణమని ఆయన అన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలు నలిగిపోతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాలను ఆర్థికాభివృద్ధిలో పాతాళానికి జగన్, కేసీఆర్‌లు తొక్కి వెళ్లారన్నారు. ఇద్దరు గురుశిష్యులు కలిసి మాట్లాడుకొని రెండు తెలుగు రాష్ట్రలను సర్వనాశనం చేశారన్నారు.

మంత్రి నారా లోకేశ్‌కు మల్లన్న ప్రసాదం



క్యాలెండర్ ఇస్తున్న ఎమ్మెల్యే

ఆత్మకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్‌ను అసెంబ్లీలోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్ల ప్రసాదం, శేషవస్త్రం, పాగాలంకరణ వస్త్రం, రుద్రాక్షలు, కంకణాలు అందజేశారు. ఈయన వెంట టీడీపీ నాయకుడు యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

కర్నూలు కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్థాలు, టోల్‌ఫ్రీ నెంబర్ వివరాలతో శాశ్వతంగా ఉండేలా స్కూల్లు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా డీఈవోను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నార్కోటిక్స్ కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సాగు, మత్తు పదార్థాల సరఫరా వినియోగాన్ని పూర్తిగా అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరం నుంచి మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి పాఠశాలల్లో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, ర్యాలీలు, ప్రతిజ్ఞల ద్వారా విద్యార్థులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని డీఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసులు, అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

యువతి, బాలిక అదృశ్యం.. ఇద్దరిపై కేసు నమోదు

మంత్రాలయం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని వి. తిమ్మాపురం గ్రామానికి చెందిన ఓ యువతి(19), మరో బాలిక(13) అదృశ్యం అయినట్లు మంత్రాలయం హెడ్‌కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 17వ తేదీ రాత్రి ఓ యువతి బహిర్భూమికి వెళ్లి తిరిగి రాలేదు. అదే గ్రామానికి చెందిన మరో బాలిక పత్తికొండ బాలికల హాస్టల్‌లో చదువుకుంటూ బంధువుల పెళ్లికి స్వగ్రామానికి వచ్చింది. ఈనెల 17న తండ్రి హాస్టల్‌లో వదిలిపెట్టి వచ్చాడు. సాయంత్రం నుంచి బాలిక కనిపించడం లేదు. ఈ ఇద్దరి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కూలికి వచ్చి మహిళ గల్లంతు

హాలహర్వి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చరపల్లి గ్రామం వద్ద శ్రీదేవి (38) అనే మహిళ ఎల్ఎల్‌సీలో దాహం తీర్చుకోవడానికి వెళ్లి గల్లంతయిందని ఎస్సై చంద్ర తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ శ్రీదేవి ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన ఆమె పచ్చరపల్లి మిరప కోతలు కోసం కూలి పనులకు వచ్చిందని దప్పిక కావడంతో దాహం తీర్చుకోవడానికి కాలువ వద్దకు వెళ్లి నీరు తాగుతుండగా కాలుజారి నీటిలో పడిపోయిందని తెలిపారు. శవం ఆచూకీ కోసం కాలువపై గస్తీ ఏర్పాటు చేశామన్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఇద్దరు కూలీల మృతి

- మహానందిలో వసతి గృహం కూల్చివేత పనుల్లో విషాదం



కూలిన వసతి గృహం పైకప్పు... రాముడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మహానంది, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహానందిలో మంగళవారం సాయంత్రం వసతి గృహం కూల్చివేత పనులకు వచ్చిన ఇద్దరు కూలీలు మృత్యువాత పడ్డారు. వీరు కందికాయపల్లెకు చెందిన రాముడు(65), వెంకటేశ్వర్లు(50) ఆలయం అభివృద్ధిలో భాగంగా భక్తుల వసతి కోసం రూ. 10 కోట్లతో నిర్మిస్తున్న నూతన వసతి గృహం నిర్మాణ పనులకు గతంలో నిర్మించిన నాగనంది సదనం వసతి గృహం కొంత భాగం అడ్డంకిగా మారింది. దీని కోసం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ అనుమతితో రూ.4.20 లక్షలకు టెండర్ ప్రక్రియను కూల్చివేత పనులను కర్నూలుకు చెందిన కాంట్రాక్టర్ నారాయణరెడ్డికి అప్పగించారు. ఇందులో భాగంగానే 10 రోజుల నుండి వసతి గృహం కొంత భాగాన్ని కాంట్రాక్టర్ రెండు ఎక్స్‌కవేటర్లతో పనులను ప్రారంభించాడు. నంద్యాల మండలం పెద్దకొట్టాలకు చెందిన కొంత మంది కూలీలు ప్రతి రోజు కూల్చివేత పనులకు వస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఎక్స్‌కవేటర్‌తో పనులు జరుగుతుండగా ఇద్దరు కూలీలు రాముడు, వెంకటేశ్వర్లు సమీపంలోని వసతి గృహం పై భాగంలో కూర్చొని పిచ్చిపాటి మాట్లాడుకుంటూ ఉండగా ఎక్స్‌కవేటర్ తాకిడికి ఉన్న పళంగా అది కూలి పోయింది.

ఈ ప్రమాదంలో రాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లును దేవస్థానానికి చెందిన బొలేరో వాహనంలో చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. రాముడుకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మరో మృతుడు వెంకటేశ్వర్లుకు ముగ్గురు కుమారులు ఉన్నారు. భార్య ఇటీవల మృతి చెందింది. ఈ సంఘటనపై ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మృతుల కుటుంబాలకు తన సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటా మన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

నవ వరుడి అనుమానాస్పద మృతి



గొంట్ల వెంకటేష్ (ఫైల్)

నంద్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణం ఎంఎస్ నగర్‌కు చెందిన నవ వరుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం కలకలం రేపింది. మృతుడు గొంట్ల వెంకటేష్ (26) శుభకార్యాలకు క్యాటరింగ్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. 3నెలల క్రితం ఓ యువతితో వివాహం జరిగింది. అయితే ఎంఎస్ నగర్‌లో తాను క్యాటరింగ్ చేసే గదిలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందడంతో స్థానికులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. స్థానికులతో ప్రాథమిక సమాచారాన్ని సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ గదికి తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు తెలిపారు.

బైకులు ఢీ.. ఒకరి మృతి



హనుమన్న (ఫైల్)

పత్తికొండ, మార్చి18 (ఆంధ్రజ్యోతి): బైకులు ఢీని ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివారలు.. పత్తికొండ వడ్డేవారికట్ట సమీపంలో నివసించే హనుమన్న(60) పట్టణంలోని మార్కెట్ వద్ద కోయనగర్‌వద్ద హోటల్‌లో టిఫిన్ చేసేందుకు వెళ్లాడు. టిఫిన్ చేశాక ఇంటికి వెళ్లేందుకు బైక్‌ను అకస్మాత్తుగా వెనుకకు తిప్పాడు. అదేసమయంలో పత్తికొండ నుంచి తుగ్గలికి వెళుతున్న పట్టణానికి చెందిన అబిరామ్ బైక్ వేగంగా ఢీ కొంది. ఈప్రమాదంలో హనుమన్న తలకు తీవ్ర గాయాలు కాగా అబిరామ్‌కు గాయాలయ్యాయి. వీరిని పత్తికొండ ఆసుపత్రికి తరలించగా హనుమన్న మృతిచెందాడు. కాగా అబిరామ్ తలకు గాయాలు కావడంతో వైద్యులు మెరుగైన చికిత్సకోసం కర్నూలుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



ముద్దాయితో సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గత శనివారం హత్యకు గురైన మహిళ నజీమూన్ కేసులో నిందితులు భర్త అబ్దుల్లా, అత్త రఫియాబీలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు నందికొట్కూరు పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నజీమూన్ హత్యకు వినియోగించిన కర్ర, కూరగాయలు తరిగే కత్తిపీటను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. పట్టణంలోని ఎస్.ఎస్.ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న ఇంట్లోనే వారిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

నంద్యాల హస్పిటల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలోని అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ రాజకుమారి తనిఖీ చేశారు. కలెక్టర్ క్యూఆర్‌కోడ్ స్కాన్‌చేసి ఆహార పదార్థాలు ఇస్తున్నారా లేదా అని వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని సూచించారు.

11 మంది ఎస్ఐలు బదిలీ

కర్నూలు క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 11 మంది ఎస్ఐల బదిలీపై డీఐజీ కోయ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
జి.హనుమంత రెడ్డి	వీఆర్, ఎస్పీ, కర్నూలు	కోసిగి పీఎస్
ఎస్.బాల నరసింహులు	హొళగుంద, పీఎస్	కర్నూలు త్రీటౌన్ యూపీఎస్
జి. చంద్రమోహన్	కోసిగి పీఎస్	కర్నూలు త్రీటౌన్ యుపీఎస్
ఎం.కేశవ	కొత్తపల్లి పీఎస్ (నంద్యాల)	నందవరం పీఎస్
వి. శ్రీనివాసులు	నందవరం పీఎస్	డీసీఆర్‌బీ, కర్నూలు
ఏ. రమేష్‌బాబు	వీఆర్ ఎస్పీ, కర్నూలు	కర్నూలు వన్‌టౌన్, పీఎస్
జే.మన్మథ విజయ్	కర్నూలు టూటౌన్ యుపీఎస్	వీఆర్ కర్నూలు అటాచ్ ఆస్పరి యూపీఎస్
ఎన్‌సీ మల్లికార్జున	డీఎస్‌బీ, కర్నూలు	జొన్నగిరి పీఎస్
ఆర్. జయశేఖర	జొన్నగిరి పీఎస్	ఆదోని త్రీటౌన్ యుపీఎస్
షేక్ మహబూబ్ బాషా	హొళగుంద పీఎస్ యూపీఎస్, ప్రస్తుతం డీఎస్‌బీ, కర్నూలు	ఆలూరు పీఎస్
జి. దిలీఫ్ కుమార్	ఆలూరు పీఎస్	హొళగుంద పీఎస్

బీసీలకు వరం ఆదరణ పథకం

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆదరణ పథకం బీసీలకు వరమని కురుబ కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.దేవేంద్రప్ప, బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాకీర్ హుసేన్ అన్నారు. మంగళవారం నగరంలోని సంక్షేమ భవన్‌లో ఉన్న బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆదరణ పథకం-3 కులవృత్తుల పరికరాలపై ఏడీ జాకీర్ హుసేన్ అధ్యక్షతన బీసీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో బీసీ కులవృత్తుల వారికి ఆదరణ పథకం-3 ద్వారా విలువైన పరికరాలను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కురువ సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణ, బోయ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ, బీసీ జాతీయ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, బీసీ సంఘం నాయకులు ధనుంజయాచారి, బీసీ కులాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాల్వబుగ్గ క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తాం

- టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్



ఆలయ అభివృద్ధి మ్యాప్‌ను పరిశీలిస్తున్న సభ్యులు, అధికారులు

ఓర్వకల్లు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయాన్ని మల్లెల రాజశేఖర్‌తో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం ఏఈ లక్ష్మీపతి, డీఈ శ్రీనివాస్ ప్రసాద్, సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ విద్యాసాగర్, ఈవో మద్దిలేటి, కాల్వబుగ్గ పుణ్యక్షేత్రాన్ని సందర్శించి పరిశీలించారు. వారికి ఈవో మద్దిలేటి, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని చిన్న, పెద్ద కోనేరులను, పరిసరాలను పరిశీలించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావుకు టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ రూ.14 కోట్ల పనులతో చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళికను బోర్డు సభ్యులకు ఇచ్చారు. ఇటీవలె కాల్వబుగ్గ దేవస్థానానికి రూ.14 కోట్ల నిధులు కేటాయించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కూడా నివేదికలు ఇచ్చామని అన్నారు. కాల్వబుగ్గలో రూ.14 కోట్లలతో స్టోన్ ఫ్లోరింగ్, పశ్చిమాన 5 అంతస్థుల రాజగోపురం పునఃనిర్మాణం, మూడంతస్థుల రాజగోపురాల నిర్మాణం, ఆలయ ప్రదేశం చుట్టూ ప్రహరిగోడ నిర్మాణం పనులను చేపట్టేందుకు నివేదికలు ఇచ్చినట్లు తెలిపారు. నాయకులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, ఆకుల మహేష్, కేవీ మధు, అబ్బీ, బజారు పాల్గొన్నారు.

నంద్యాల
నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మెయిన్స్ పరీక్షలు వెంటనే నిర్వహించాలి

● డీవైఎఫ్ఐ డిమాండ్


మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షను నిర్వహించాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న, జిల్లా అధ్యక్షులు మధుశేఖర్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించి వదిలేశారని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే మెయిన్స్ నిర్వహించి అభ్యర్థులను ఆదుకోవాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు.

మూల పెద్దమ్మకు వెండి త్రిశూలం బహూకరణ


అమ్మవారికి వెండి త్రిశూలం బహూకరిస్తున్న భక్తులు

గడివేముల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలపెద్దమ్మకు రూ.70 వేలు విలువ చేసే వెండి త్రిశూలాన్ని గడివేములకు చెందిన ఎల్ల నాగన్న, భూలక్ష్మి దంపతులు మంగళవారం అందజేశారు. మిడ్తూరు మండలం పీర్‌సాహెబ్ పేట మాజీ సర్పంచ్ దివంగత దేవమడ లక్ష్మన్న జ్ఞాపకార్థం ఆయన కుమారుడు ఎల్ల నాగన్న వెండి త్రిశూలం అందజేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రామలింగారెడ్డి తెలిపారు. దాతలను ఆలయ కమిటీ సభ్యులు దేశం రమణారెడ్డి, నరేంద్రారెడ్డిలు సన్మానించారు. కార్యక్రమంలో మిడ్తూరు మాజీ జెడ్పీటీసీ జయమ్మ, మిడ్తూరు మండల టీడీపీ బీసీ సంఘం నాయకులు జయరాముడు, పెద్ద నాగస్వామి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు

ఆత్మకూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సూచనలతో సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్సీ ఏవో హేమలతలు పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని కురుకుంద, కొట్టాల చెరువు గ్రామాల్లో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారి అరుణ, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

బండిఆత్మకూరు, మార్చి18(ఆంధ్రజ్యోతి): నవనందుల్లో ఒకటైన కృష్ణనంది ఆలయ హుండీని దేవస్థానం అధికారులు లెక్కించారు. మంగళవారం ఆలయాల ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఈవో వేణునాథరెడ్డి, చైర్మన్ తిరుపెంరెడ్డిల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. రూ. 92వేల 975 లభించినట్లు ఈవో తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించండి

పగిడ్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పగిడ్యాల గ్రామానికి ఫీల్డ్‌అసిస్టెంట్‌ను నియమించాలని సీపీఐ(యంఎల్)లిబరేషన్ జిల్లా నాయకులు పి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పగిడ్యాల గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో కూలీలకు సక్రమంగా మస్టర్లు అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే చర్యలు తీసుకొని రెగ్యులర్ ఫీల్డ్‌అసిసెంట్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం తాలుకా అధ్యక్షుడు సుధాకర్, వెంకటేశ్వర్లు, రాముడు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి


ఎంపీడీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపాడు గ్రామానికి చెందిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌ను అధికారులు సస్పెండ్ చేసినా అలాగే విధుల్లో కొనసాగిస్తున్నారని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం టీడీపీ మండల కన్వీనర్ వెంకటేశ్వర్లుయాదవ్, జిల్లా అధికారప్రతినిధి గిరీశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, సర్పంచ్ లక్ష్మీదేవమ్మలు ఎంపీడీవో గోపికృష్ణకు వినతిపత్రం అందజేశారు. పనుల వద్ద ఉపాధి కూలీలతో అసభ్యకరంగా మాట్లాడి భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఖాజీకురైషన్, సుదర్శన్‌గౌడ్, మాబాషా, బాబురెడ్డి , ఉపాధికూలీలు పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటి పూట నిర్వహించాలి'

నందికొట్కూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకులు రఘురాం మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని స్త్రీ, శిశుసంక్షేమ శాఖ కార్యాలయంలో సీడీపీవో కోటేశ్వరమ్మకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు రఘురాం మూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు ఒంటిపూట బళ్లు నిర్వహిస్తున్నారని, అలాగే అంగన్‌వాడీ స్కూళ్లకు కూడా ఒంటి పూట స్కూల్స్ నిర్వహించాలని కోరారు.

సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు

బండిఆత్మకూరు, మార్చి18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సగం సబ్సిడీతో అందజేయనున్న వ్యవసాయ పనిముట్ల కొరకు రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఏవో స్వాతి సూచించారు. మంగళవారం మండలంలోని పెద్దదేవళాపురం, భోజనం గ్రామాల్లో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తపల్లి: ప్రస్తుత వేసవి కాలంలో రైతులు తమ పొలాల్లో వేసవి దుక్కులు దున్నుకుంటే భూమి సారవంతంగా ఉంటుందని ఏవో మహేష్ రైతులను సూచించారు. మంగళవారం మండలంలోని శివపురం, గుమ్మడాపురం గ్రామాల్లో ఏవో మహేష్ ఆధ్వర్యంలో పొలం పిలస్తుంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గుమ్మడాపురం సర్పంచ్ నక్క విజయకుమార్, ఉప సర్పంచ్ గొల్ల శ్రీనివాసులు, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ఛీ కంపు..కంపు!


సంజీవనగర్ కూడలి సమీపంలోని డ్రైనేజీలో చెత్తాచెదారం


మున్సిపాలిటీ సమీపంలో రోడ్డుపైనే చెత్తా చెదారం

నంద్యాల మున్సిపాలిటీ మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో కంపు కొడుతోంది. మురుగు కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయాయి. ఎక్కడ చూసినా చెత్త కనిపిస్తోంది. జిల్లా కేంద్రమైన నంద్యాలలో 3 లక్షల జనాభా ఉండగా, 42 కౌన్సిలర్లు ఉన్నారు. అయితే కౌన్సిలర్లు, అధికారులు ఎక్కడ కూడా పారిశుధ్యంపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి పన్ను, కొళాయి పన్నులపై చూపిస్తున్న శ్రద్ధ పారిశుధ్యంపై ఎందుకు చూపడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.



- చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైనేజీలు
- శుభ్రం చేయని సిబ్బంది
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు

వీధుల్లోనే కాదు ప్రధాన రోడ్లు కూడా మురికి మయమే

42 వార్డుల్లోని వీధులే కాదు ప్రధాన వీధుల్లో సైతం పారిశుధ్య నిర్వాహణ వైఫల్యమైనట్లు కనిపిస్తోంది. ప్రధాన వీధుల్లో మురికి నీటి కాలువల దుస్థితిని పరిశీలిస్తే చాలు నంద్యాల నగర పాలన సిబ్బంది తీరు, మాటలు జాస్తి పారిశుధ్యం నాస్తి అన్న తీరును తలపిస్తోంది. ఇటీవల సాక్షాత్తు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కె. విజయానంద్‌తో కలిసి మంత్రి ఫరూక్ స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నంద్యాల స్వచ్ఛత విషయంలో రాష్ట్రానికి ఆదర్శం కావాలన్నారు. మరి నంద్యాల నగర పాలక పారిశుధ్య అధికారులు పాటిస్తున్నారా? మా జీతాలు మాకు వస్తే చాలు అని అనుకుంటున్నారా అని ప్రజలు ముక్కుమూసుకుంటూ మౌన వేదన అనుభవిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రుల పనితీరు ఆధారంగా ఇచ్చిన ర్యాంకుల్లో మంత్రి ఫరూక్ మొదటి స్థానంలో నిలిచారు. కానీ నంద్యాల పట్టణ పారిశుధ్య నిర్వాహణ అధమ స్థాయిలో ఉంది.

శివారు కాలనీల్లో దారుణం..

శివారు కాలనీలో పారిశుధ్యం పడకేసింది. సరైన డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. రోడ్లు కూడా సరిగా లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగునీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య మెరుగుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైనేజీలు



డ్రైనేజీలన్నీ చెత్తచెదారంతో నిండిపోయాయి. నెలల కొద్ది డ్రైనేజీలను శుభ్రం చేయడం లేదు. దీంతో కంపుతో భరించలేకపోతున్నాం. డ్రైనేజీలను శుభ్రం చేయాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదు.

- లక్ష్మణ్, డీవైఎఫ్ఐ కార్యదర్శి

ప్రధాన వీధుల్లో దుర్వాసన



బస్టాండు నుంచి మున్సిపల్ కార్యాలయం వెళ్లే ప్రధాన రోడ్డుతో ఇతర ప్రధాన రోడ్డు పక్కన ప్రవాహించే మురికి కాలువలో దురాస్వసన వెద జల్లుతున్నాయి. డ్రైనేజీలో చెత్తచెదారం నిండిపోయింది. రోడ్డుపక్కన వెళ్లే వారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అధికారులు వెంటనే డ్రైనేజీలను శుభ్రం చేయాలి.

- ప్రసాద్, వెండర్


బస్టాండు ఎదురుగా ఉన్న డ్రైనేజీలో నిండిపోయిన చెత్తాచెదారం

దళిత కాలనీల్లో దారుణం



దళిత కాలనీల్లో పారిశుధ్యం పడకేసింది. డ్రైనేజీల్లో పందులు, కుక్కలు పొర్లాడుతుండడంతో కంపుకొడుతున్నాయి. కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు దళిత కాలనీపై చిన్న చూపు చూస్తున్నారు. వెంటనే అధికారులు, ప్రజాప్రతినిధులు డ్రైనేజీలు శుభ్రం చేయాలి.

- నాగరాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి



పారిశుధ్య పనులు చేస్తున్నాం..

పట్టణంలో పారిశుధ్య పనులు చేపడుతున్నాం. ప్రధాన వీధుల్లో కాల్వల నిర్మాణం లోపం కారణంగా మురుగునీటి ప్రవహనికి అడ్డంకులు ఏర్పడి చెత్త పేరుకపోతోంది. కాల్వల నిర్మాణాలు పూర్తయిన వెంటనే చెత్త చెదారాన్ని తొలగిస్తాం.

- మురళీధర్, శానిటరీ సూపర్‌వైజర్, నంద్యాల

అర్హులకు గృహాలు మంజూరు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

పగిడ్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇల్లులేని నిరుపేదలకు గృహాలు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముచ్చుమర్రి గ్రామంలో మంగళవారం రాత్రి గృహ నిర్మాణాలపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేని వారికి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ఎస్టీలకు రూ.లక్ష, ఎస్సీ బీసీలకు రూ. 50వేలు అదనంగా అందజేయం జరుగుతుందన్నారు. గృహాలు మంజూరైన వారు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి గృహాలు మంజూరు అయ్యేలా చూడాలన్నారు. గతంలో ఇళ్లు మంజూరు కానప్పటికి మంజూరైనట్లు ఐడీలు చూపుతున్నాయని, కొంత మంది ఆయన దృష్టికి తీసుకొని రావడంతో అలాంటి వాటిని సంబంధిత అధికారులు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కట్టుబడి శ్రీనివాసులు నాయుడు, జయారామిరెడ్డి , హౌసింగ్ ఏఈ అనిల్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం

● జిల్లా విద్యుత్ శాఖ అధికారి సుధాకర్ కుమార్


గోకవరం 33కేవీ నుంచి విద్యుత్‌ను ప్రారంభిస్తున్న జిల్లా విద్యుత్ శాఖ అధికారి సుధాకర్ కుమార్

కొత్తపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని నంద్యాల జిల్లా విద్యుత్ శాఖ అధికారి సుధాకర్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని గోకవరం గ్రామ శివారులోని ఆర్‌డీఎస్ఎస్ స్కీం కింద 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి గోకవరం గ్రామానికి 24 గంటల త్రీఫేస్ సప్లయ్ 11 కేవీని నంద్యాల ఈఈ శ్రీనివాసులు, ఆత్మకూరు ఈఈ జయశంకర్, డీఈలు రామసుబ్రహ్మణ్యం, రంగస్వామిలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎస్ఈ సుధాకర్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామీణ ప్రాంతాలకు సైతం ఆర్‌డీఎస్ఎస్ ద్వారా మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. అందులో భాగంగా జిల్లాలోని 249 ఫీడర్లకు దశలవారీగా 24 గంటల త్రీఫేస్ సప్లయ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలకు తాగునీరు, పొలాలకు సాగునీరు, ఇతర చిన్న పాటి పరిశ్రమలకు కూడా ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు అబ్దుల్ అబీద్, కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల కల్చరల్, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ కార్యాలయం దగ్గర విద్యుత్ మీటర్స్ డీలర్స్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు, విద్యుత్ రీడర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు వస్తున్న తరుణంలో విద్యుత్ మీటర్ రీడర్స్ తమ ఉపాధిని కోల్పోతామన్నారు. అనంతరం విద్యుత్ డీఈ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడిజిల్లా కార్యదర్శి దస్తగిరి, కోయిలకుంట్ల మీటర్స్ రీడర్స్ సబ్ డివిజన్ అధ్యక్షుడు పటాన్ ఖాజా హుస్సేన్, బాబు సాహెబ్, రవికుమార్, నాగేషు, మహేష్, వెంకటనవీన్,ప్రసాద్, లింగన్న దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ జాతర

నందికొట్కూరు రూరల్, మార్చి18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెమాను గ్రామంలో రేణుకాఎల్లమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ జాతర మూడు రోజుల పాటు జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. బుధవారం నాడు రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పందేలు కూడా నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు

పగిడ్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన విద్యార్థిపై కుక్కలు దాడి చేయడంతో మంగళవారం తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన అయేషా అనే విద్యార్థిని ప్రాతకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుకుంటుంది. ఉదయం పాఠశాలకు రోడ్డు వెంట వెళ్తుండగా కుక్కలు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి విద్యార్థిని చికిత్స నిమిత్తం నందికొట్కూరు ఆసుపత్రికి తరలించారు.

బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం

నందికొట్కూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పగడం రాఘవయ్య, నందికొట్కూరు ఇన్‌చార్జి కోట ప్రభాకర్‌లు అన్నారు. మంగళవారం పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ దేశ ప్రధానిగా పని చేసిన బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం నందికొట్కూరులో లేదని, విగ్రహాన్ని కొత్త బస్టాండ్ ఔట్ పోస్టు సర్కిల్ వద్ద ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు పల్లె నాగరాజు, సోమన్న, తిరుపాలు, కాటపోగు జాను, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల నూనెపల్లె, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ లీలావతి దేవి మంగళవారం తెలిపారు. కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశాల మేరకు పార్ట్‌టైం, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్దతిన పోస్టులను భర్తీ చేయనున్నట్లు ఆమె చెప్పారు. మిషన్ వాత్సల్య పథకం, మిషన్ శక్తి పథకం, సోషల్ అభియాన్‌లలో ఖాళీగా ఉన్న పోస్టులకు 20వ తేదీ నుంచి 29వ తేదీ లోపు నంద్యాల జిల్లాకేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తులను అభ్యర్థులు సమర్పించాలని సూచించారు. విద్యార్హతలు, పూర్తి వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

'అక్రమంగా చందాలు వసూలు చేస్తే సహించేది లేదు'

వెలుగోడు మార్చి 18 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో కాటేజీలు నిర్మిస్తున్నామని, మరి కొంతమంది కాశిరెడ్డినాయన ఆశ్రమాలు చేపడుతున్నామని తాము రెడ్లమని చెప్పుకొంటూ అక్రమంగా చందాలు వసూలు చేస్తే సహించేది లేదని వెలుగోడు పట్టణానికి చెందిన ముక్కమళ్ల బాస్కరెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ ఇలా తమ రెడ్ల పేర్లను చెప్పుకొని రాజమండ్రిలో కొంతమంది పట్టుబడ్డారని తెలిపారు. పోలీసులు విచారించగా రూ 20 లక్షలు వసూలు చేసినట్లు తెలిసిందని అన్నారు. వారిని పోలీసులు విచారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఖోఖో అసోసియేషన్ ఎన్నిక


ఖోఖో అసోసియేషన్ గౌరవాధ్యక్షులను సత్కరిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణ ఖోఖో అసోషియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పీల్ మున్నా మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణ గౌరవాధ్యక్షులుగా బాబు, అధ్యక్షులు మహెబూబ్, ఉపాధ్యక్షుడిగా ప్రసాద్, కార్యదర్శిగా బాషా, కోశాధికారిగా సతీష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఖోఖో అసోసియేషన్ ద్వారా ఉచిత శిక్షణ కల్పించనున్నట్లు తెలిపారు.

దళిత వాడలను అభివృద్ధి చేయాలి

ఆత్మకూరు, మార్చి 18(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని దళిత వాడలను అభివృద్ధి చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్ నాయక్‌లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ఆత్మకూరు పట్టణంలోని ఎస్సీజీపాలెం, ఏబీఎం పాలెంలలో వారు పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీలో పారిశుధ్యం లోపించిందని అన్నారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కాలనీలో దోమల వ్యాప్తి పెరిగి వ్యాధులు విజృంభిస్తున్నాయని చెప్పారు. ఆయా సమస్యలను అధికారులు పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అంబయ్య, సామేలు తదితరులు ఉన్నారు.

ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళా కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆత్మకూరులో నిర్వహించిన జాబ్‌మేళాకు నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరైనట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో 32 మంది ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి, అధ్యాపకులు విద్యాసాగర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న ఉన్నారు.

'అసాంఘిక కార్యకలాపాల నిలయంగా వైద్యశాల'

ఆత్మకూరు రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కురుకుంద గ్రామంలో వైద్యశాల ప్రారంభానికి నోచుకోక అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏసురత్నం, నరసింహనాయక్,మండల కార్యదర్శి సుధాకర్, నాయకులు మాభాష అన్నారు. మంగళవారం వారు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కురుకుంద గ్రామంలోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పలు కాలనీలలో తాగునీటి సమస్య ఉందని, అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. అలాగే వైద్యశాలను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు నాగరాజు,జయరాజు,రమేష్, లింగస్వామి,వరలక్ష్మి,సీతమ్మ, బాలయ్య, వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

ఉగాది ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో

శ్రీశైలం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో 27 నుంచి 31 వరకు ఉగాది మహోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో కర్ణాటక, మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు క్షేత్రాన్ని సందర్శించే అవకాశం ఉన్నందున దేవస్థానం భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లను చేపట్టింది. మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు సంబంధిత అధికారులతో కలిసి క్యూలైన్లు, పాతాళగంగ పలు ప్రదేశాలను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఈవో సూచించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎం. నరసింహారెడ్డి, ఏఈఈలు జి. స్వాములు, మల్లికార్జున రెడ్డి, సంబంధిత అధికారులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ

రుద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ అన్నారు. మంగళవారం హరినగరం, తిమ్మనపల్లె గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఏపీసీఎన్ఎస్ జిల్లాఅధికారి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ సుస్థిర దిగుబడులు సాధించేందుకు ప్రకృతి వ్యవసా యమే మార్గమని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏవో సుమతి, ఏఈవోలు , టీడీపీ నాయకులు సంజీవ పాల్గొన్నారు.

నేరప్రవృత్తికి దూరంగా ఉండాలి: సీఐ

డోన్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తికి దూరంగా ఉండి ప్రశాంత జీవనాన్ని గడపాలని రూరల్ సీఐ రాకేష్‌బాబు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని చనుగొండ్ల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. రూరల్ సీఐ రాకేష్‌బాబు మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్థులు ఉన్నారు.

ఉపాధి పనుల్లో రూ. 1,35,694 అవినీతి

కొలిమిగుండ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో రూ.1,35,694 అవినీతి జరిగినట్లు అధికారులు తెల్చారు. మంగళవారం కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఉపాధి సిబ్బంది, అధికారులు తప్ప ప్రజలెవ్వరూ పాల్గొనక పోవడంతో అత్యంత సాదాసీదాగా జరిగింది. నంద్యాల జిల్లా ఉపాధి ఏపీడీ, జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీనాయక్, హెచ్ఆర్ మేనేజర్ షీభారాణి, ఎస్ఆర్‌పీ కాంతాయ్య తదితరులు నిధులకు సంబంధించి జమ ఖర్చుల లెక్కలు తనిఖీ చేశారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ గ్రామాల్లో రూ. 5.50కోట్ల ఉపాధి పనులు చేపట్టారు. మొత్తం పను ల్లో మొత్తం రూ.1,35,694 అవినీతి జరిగినట్లు అధికారులు తెల్చారు. అవినీతికి పాల్పడిన సిబ్బంది నుంచి ఈమొత్తాన్ని రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఏపీ వోలు గంగన్న, రాజాబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

28న మంత్రి బీసీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

బనగానపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ఈనెల 28న శుక్రవారం రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు ఉపసర్పంచ్ బురానుద్దీన్ మంగళవారం తెలిపారు. పట్టణంలోని ప్రతి ముస్లిం ఇఫ్తార్ విందులో పాల్గొనాలని ఆయన కోరారు.

టంగుటూరులో దారి మళ్లింపు

బనగానపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు పెద్దమ్మ జాతర సందర్భంగా బుధవారం ట్రాఫిక్ డైవర్షన్ చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు. టంగుటూరులో నిర్వహించనున్న పెద్దమ్మ జాతర సందర్భంగా లారీలు, టిప్పర్లు, బనగానపల్లె వైపునుంచి నంద్యాల టంగుటూరు గ్రామం మీదు గాకుండా పాణ్యంవైపు వెళ్లాలని ఆయన సూచించారు.

నిబంధనలు పాటించాలి: సీఐ

కొలిమిగుండ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను ఆటోల్లో ఎక్కించరాదని సీఐ రమేష్‌బాబు అన్నారు. ఆటోవాలాలు నిబంధనలు తప్పక పాటించాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సర్వేలు వేగవంతం చేయండి

ఉయ్యాలవాడ, మార్చి 18(ఆంధ్రజ్యోతి): మండలంలో జరగుతున్న పీ4, వర్క్ ఫ్రమ్ హోమ్ తదితర సర్వేలను వేగవంతం చేయాలని డీఎల్‌డీవో శివారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంటులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలు త్వరగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఉమ మహేశ్వరరావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు ఉన్నారు.

బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్

బనగానపల్లె, మార్చి 18(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఏ గ్రేడ్ వచ్చినట్లు ప్రిన్సిపాల్ ఎస్.లలిత మంగళవారం తెలిపారు. కమిషనర్ ఆఫ్ కాలేజీ యట్ ఎడ్యుకేషన్ మార్గదర్శకాలను అనుసరించి ప్రభుత్వం ఏ గ్రేడ్ ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు. కళాశాల విద్యాసంబంధిత అంశాలపై అకడమిక్ ఆడిట్ నిర్వహించినట్లు తెలిపారు. అకడమిక్ అధికారులుగా నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ఎస్.పార్వతి, నందికొట్కూరు అధ్యాపకులు ఝాన్సిరాణి వ్యవహరించారన్నారు. కళాశాలలో డిజిటల్ తరగతి గదులు, సెమినార్‌హాల్, ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బడాసాహెబ్ , అధ్యాపకులు బాబూనాథ్, సూర్య నారాయణరెడ్డి, మహమ్మద్‌గౌస్, సుధాకర్‌రెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రామకృష్ణ, నీతమ్మ, కౌసల్యాదేవి, వరలక్ష్మి, రవికుమార్ పాల్గొన్నారు.

భానుడు భగ భగ

- 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- మధ్యాహ్నానికే రోడ్లు ఖాళీ


చాగలమర్రిలో నిర్మానుష్యంగా ఉన్న పాతబస్టాండు రహదారి

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉదయం మంచు, మధ్యాహ్నానికి ఎండ సెగలు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలో మార్పుల కారణం గా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగైదు రోజులతో పోల్చుకుంటే మంగళవారం ఉష్ణోగ్రత పెరిగింది. 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 11 గంటల నుంచే భానుడు భగభగమన్నాడు. పలు వీధులు మధ్యాహ్న సమయానికే నిర్మానుషంగా మారాయి. ఒంటిపూట బడులకు వెళ్లే వి ద్యార్థులు గొడుగు సాయంతో వెళ్తున్నా రు. మహిళా కూలీ లు నెత్తిపై దుస్తు లు కప్పుకొని వెళ్లా ల్సి వస్తోంది. ఒంటి పూట బడులు కావ డంతో పిల్లలు సమీపం లోని వక్కిలేరు, కుందూలలో జలకాలాట ఆడుతున్నారు.


మండుటెండలో గొడుగు సాయంతో వెళ్తున్న మహిళలు


చాగలమర్రిలో మండు టెండలో గొడుగు సాయంతో వెళ్తున్న విద్యార్థినులు

వైభవం.. స్వాతి మహోత్సవం

- అహోబిలంలో శాస్త్రోక్తంగా స్వాతి, సుదర్శన హోమం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 18(ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. దిగువ అహోబిలంలోని యాగశాలలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాద వరదస్వామి ఉత్సవమూర్తులతో పాటు అమృతవల్లి అమ్మవారికి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, నవకలశ తిరుమంజనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పట్టుపీతాంభరాలు, పూలమాలలతో అలంకరించి విశేష పూజలు చేశారు. స్వామి, అమ్మవార్లకు ఎదురుగా హోమ మండపాన్ని ఏర్పాటు చేసి సాంప్రదాయబద్ధంగా సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ స్వాతి మహోత్సవ వేడుకలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వాతి వేడుకల్లో పాల్గొన్నారు.


అహోబిలంలో సుదర్శనహోమం నిర్వహిస్తున్న అర్చకులు


మద్దిలేటి స్వామి క్షేత్రంలో స్వామివారి జన్మనక్షత్ర వేడుకలు నిర్వహిస్తున్న అర్చకులు

మద్దిలేటి స్వామి క్షేత్రంలో..

బేతంచెర్ల : మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో స్వామివారి జన్మనక్షత్రం కావడంతో మంగళవారం స్వాతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో సమాజ శ్రేయస్సు కోసం హోమాలను నిర్వహించి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీదేవి భూదేవి సహిత మద్దిలేటి నరసింహ స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని వేద పండితులు అర్చకులు నిర్వహించారు.

ఆధార్ అనుసంధానం చేయాలి

డోన్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని డోన్ ఆర్డీవో నరసింహులు బీఎల్‌వోలకు సూచించారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్టుహౌస్‌లో నియోజకవర్గ స్థాయి బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానంతో పాటు మృతి చెందిన ఓటర్లను గుర్తించి ఓటరు లిస్టు నుంచి తొలగించి ఎప్పటికప్పుడు పరిశీలించి పూర్తిస్థాయిలో ఓటరు లిస్టు జాబితాలో సిద్ధం చేయాలని సూచించారు.

- ముందుగా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆర్డీవో నరసింహులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ప్రతి నెలా మొదటి వారంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఓటరు కార్డులో తప్పు ఒప్పులను తమ దృష్టికి తీసుకరావాలన్నారు. సమావేశంలో డోన్, బేతంచెర్ల, ప్యాపిలి తహసీల్దార్లు నాగమణి, ప్రకాష్‌బాబు, భారతి, డిప్యూటీ తహసీల్దార్ సునీల్‌రాజు, సర్వేయర్ జగదీష్, వీఆర్వోలు, రాజకీయ పార్టీల నాయకు లు శ్రీరాములు, ఓంప్రకాష్, టైలర్ ఖాజా, రమణ, జనార్దన్, సోమే ష్ యాదవ్, మల్లెంపల్లె రామచంద్రుడు, జాకీర్‌హుసేన్, సుంకయ్య, మోట రాముడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహులు

పూత రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

రుద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున మామిడిలో పూత, పిందె రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యానశాఖ పరిశోధన శాస్త్రవేత్త దీప్తి రైతులకు సూచించారు. మంగళవారం రుద్రవరం గ్రామ సమీపంలో ఉన్న మామిడి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. నేలలో తేమశాతం అధికంగా ఉన్నా తక్కువగా ఉన్న పూత, పిందె రాలుతుందన్నారు. కాల్వల ద్వారా ఆరురోజులకు ఒకసారి, డ్రిప్‌ల ద్వారా మూడురోజులకు ఒకసారి నీటి తడులు కట్టుకోవాలన్నారు. పూత, పిందె రాలేందుకు తామరపురుగు, లేదా బూడిద తెగులు కూడా కారణం కావచ్చు న్నారు. ఉద్యానవనశాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకొని మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి శ్రీధర్, వీఏహెచ్‌ఏలు ఫణింద్ర, రాజు పాల్గొన్నారు.


రుద్రవరంలో మామిడి తోటలు పరిశీలిస్తున్న శాస్త్రవేత్త దీప్తి, అధికారులు

డోన్‌లో జాబ్ మేళా

డోన్ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాను ఉద్దేశించి కళాశాల ట్రైనింగ్ ఆఫీసర్ ధర్మకర్ మాట్లాడుతూ జాబ్‌మేళాను నిరుద్యోగ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మూడు కంపెనీల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 26 మంది అభ్యర్థులు హాజరు కాగా, 12 మంది అర్హతను సాధించారు.

రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

బేతంచెర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూటుపల్లె రెవెన్యూ పరిధిలోని గ్రామాల రైతులు కంది పంటను గిట్టుబాటు ధరకు అమ్ముకోవడానికి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని హార్టికల్చర్ అసిస్టెంట్ రాజు నాయక్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కంది ధాన్యానికి ప్రభుత్వం ఒక క్వింటానికి రూ.7,550లు ఇస్తుందన్నారు. మద్దతు ధర కోసం రైతులు సచివాలయం వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ అవినాష్ రెడ్డి, ఎంపీఈవో బాలకృష్ణ రైతులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్యశిబిరం

బేతంచెర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బేతంచెర్ల మండలంలోని సీతారామాపురం, సంకలాపురం గ్రామాల్లో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య మంగళవారం తెలిపారు. శిబిరం ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా చేస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతు సంఘంలో సభ్యులుగా చేరాలి

బేతంచెర్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబాపురం గ్రామంలో ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి పి.రామ్మోహన్ ఆధ్వర్యంలో మంగళవారం ఏపీ రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రైతు సంఘంలో సభ్యులుగా చేరాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, రహంతుల్లా, కిష్టన్న, మధు, రామలక్ష్మి, ఆదిలక్ష్మి, మధు, ఎల్లకృష్ణ, వెంకట సుబ్బయ్య, అంబాపురం రైతులు పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా చేపట్టండి

డోన్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూ రీసర్వేను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ నాగమణి సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల, సర్వేయర్లు, వీఆర్వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ సునీల్ రాజా, మండల సర్వేయర్ జగదీష్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

డోన్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఏపీ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణ సమీపంలో ఉన్న డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-12 బాలబాలికల రగ్బీ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ మూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవేంద్ర, మహబూబ్ సుభానీ, రాజేశ్వరి, రామమోహన్, నాగేశ్వరి పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

అవుకు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం రైతులకు 50 శాతం సబ్సిడీతో ఆధునిక వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను అందిస్తున్నట్లు వ్యవసాధికారి అబ్దుల్‌హక్ అన్నారు. మంగళవారం నిచ్చెనమెట్ల గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ బ్యాటరీ స్ప్రేయర్లు, ఫుట్‌స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్లు, రోటోవేటర్లు, పవర్‌వీడర్లు, పవర్‌టిల్లర్లను సబ్సిడీపై అందిస్తుందన్నారు. రైతులు దరఖాస్తు చేసుకొని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

రుద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. ఈ నెల 18 నుంచి 22వరకు నాగులవరం, రుద్రవరం, శ్రీరంగాపురం, యల్లావత్తుల, ఆలమూరు, చిత్రరేణిపల్లె గ్రామాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆధార్ కార్డులో ఉన్న తప్పు ఒప్పులను సవరించుకోవాలని సూచించారు.

దొర్నిపాడు లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళం

రుద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : దొర్నిపాడు లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నంద్యాల పట్టణంలో శ్యామల హాస్పిటల్ యాజమాన్యం రూ.లక్ష విరాళం మంగళవారం అందించినట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో దాతలు వైద్యులు శ్యామల, సంజీవ, కాణాల నరసింహుడు, బండల శ్రీను, దస్తగిరి, ఓబులయ్య తదితరులున్నారు.

కార్యకర్తలకు అండగా భూమా కుటుంబం

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 18(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వం, భూమా కుటుంబం కార్యకర్తలకు ఎళ్లవేళలా అండగా ఉంటుందని ఆ పార్టీ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. బుడగజంగాల కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త రమణ బాబు నంద్యాలలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో గుండె ఆపరేషన్ చేయించుకోవడంతో జగత్‌విఖ్యాత్‌రెడ్డి మంగళవారం వెళ్లి పరామర్శించారు.


చాగలమర్రి టోల్‌ప్లాజాలో మాట్లాడుతున్న పీడీ అశోక్‌కుమార్

ఆరోగ్య సేవలు అందించడమే టోల్ లక్ష్యం

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సేవలు అందించడమే టోల్‌ప్లాజా లక్ష్యమని నేషనల్ హైవే పీడీ అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద ఎన్‌హెచ్ఐ డబ్ల్యూఎల్ లైఫ్‌కేర్ వారు సంయుక్తంగా టోల్‌ప్లాజా సిబ్బంది ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణలో పీడీ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు సరైన సమయంలో వైద్య సేవలు అందించాలని అన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని, ప్రమాదాల స్థాయిని తగ్గించాలని, సీపీఆర్ నేర్చుకోవడం ద్వారా చాలా ఉపయోగం ఉంటుందన్నారు. సమావేశంలో రాష్ట్ర హైవే కో-ఆర్డినేటర్ మహేష్‌కుమార్, రాయలసీమ ప్రాజెక్టు హెడ్ మదన్‌మోహన్, అరున్‌రాజ్, సంతోష్ బాష, మనోహర్‌రెడ్డి, టోల్‌ప్లాజా అధికారులు పాల్గొన్నారు.

'పనిభారం తగ్గించాలి'

అవుకు, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ కార్యదర్శులపై పనిభారం తగ్గించాలని మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఎంపీడీవో వెంగన్నకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడు హరిప్రసాద్, గౌరవ సలహాదారుడు ప్రభాకర్, మండల ఉ పాధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన సుధాకర్, పంచాయతీ కార్యదర్శులు నాగలక్ష్మమ్మ, దినేష్, విజయకుమారి, మనోజ్, రాజేష్, సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు

22న బహిరంగ వేలం

కోవెలకుంట్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల మేజరు గ్రామ పంచాయతీలోని సంత, దిన మార్కెట్, బస్టాండు, కబేళాలకు సంబంధించి బహిరంగ వేలాన్ని ఈ నెల 22న నిర్వహించనున్నట్లు ఈవో ప్రకాశ్‌నాయుడు తెలిపారు. 2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 సంబంధించి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు వివరాల కోసం కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలో సంప్రదించాలని ఈవో సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న డీఎల్‌డీవో శివారెడ్డి

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని డీఎల్‌డీవో శివారెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా గ్రామాల్లో వార్డు, సచివాలయ సిబ్బంది చేపట్టిన పి-4 సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వేలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి క్షీరాభిషేకం

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని చెన్నకేశవ ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహానికి మంగళవారం స్వాతి నక్షత్రం సందర్భంగా క్షీరాభిషేకం, రుద్రా భిషేకం పూజలు చేశారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీఎస్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, గురుస్వామి ప్రసాద్, భాస్కర్, అరుణ్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సామార్థ్యాలను పెంచాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. మంగళవారం చాగలమర్రి గ్రామంలోని పాత బస్టాండులోగల ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను, విద్యార్థుల గ్రేడింగ్‌ను పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మౌళాలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని మల్లేవేములలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అదనపు నిధులు మంజూరు

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాల లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేసినట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం చాగలమర్రి కస్తూర్బా పాఠశాల సమీపంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గతంలో యూనిట్ ధర రూ.1.80 లక్షలు ఉండగా ఎస్సీ, బీసీలకు అదంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, చెంచు లబ్ధిదారులకు రూ.లక్ష అదనపు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు మే చివరిలోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ నరసింహరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఓబులేసు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిపై ప్రత్యేక దృష్టి

చాగలమర్రి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి ఉంచామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ క్రాస్ ప్రోగ్రామ్ ద్వారా పని చేయని చేతిబోర్లను మరమ్మతులు చేయించామన్నారు. నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

రుద్రవరం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రేషన్‌కార్డుదారులు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖరయ్య మంగళవారం అన్నారు. మండలంలోని 39 చౌక దుకాణాలున్నాయన్నారు. కార్డుదారుల జాబితా డీలర్ల వద్ద ఉందన్నారు. లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోకపోతే కార్డు తొలగించబడుతుందన్నారు. ఇందుకు రెవెన్యూ అధికారులు బాధ్యులుకారన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 18(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కలిసి నియోజకవర్గంలోని సమస్యలు, నిధుల సమీకరణపై ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం మహిళా ఎమ్మెల్యేలతో కలిసి ఫొటో దిగారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కొలిమిగుండ్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడుతు న్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరీముల్లా అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు నీటిని వృథా చేయరాదన్నారు.